# మర్రి చెట్టు - గుమ్మడి కాయలు

బ్రతకలేక బడిపంతులు అన్న సామెత శ్రీకాంత్ మేష్టారిపట్ల ఎంతవరకూ నిజమో చెప్పడం కాస్త కష్టమే! ఎందుకంటే ఆయన బడిపంతులు కావాలని ఎన్నడూ అనుకోలేదు. ఎన్ని రకాలుగానో ప్రయత్నించి మరేదారీ కనిపించని పరిస్థితులలో తెలిసినవారి సిఫారసు వల్ల లభించిన ఉద్యోగం అది. ఉద్యోగంలో చేరాక కూడా ఒకటి రెండు సంవత్సరాలు ఆయన తీవ్ర ప్రయత్నాలు చేశాడు మరో ఉద్యోగమేదైనా దొరుకుతుందేమోనని. ఆ ప్రయత్నాలన్నీ విఫలమైపోవడంతో క్రమంగా బడిపంతులుగా స్థిరపడ్డాడు. ఈ విధంగా చూస్తే శ్రీకాంత్ మేష్టారు బ్రతకలేక బడిపంతులయ్యాడనిపిస్తుంది.

అయితే బ్రతకలేక బడిపంతులైన శ్రీకాంత్ బడిపంతులైనాక బ్రతకడం ప్రారంభించాడు. అదైనా సామాన్య జీవితం కాదు, బడిపంతులుగా ఒక విశిష్టతను తన జీవితానికి ఆపాదించుకోగలిగాడాయన.

శ్రీకాంత్ మేష్టారంటే విద్యార్థులకు అపరిమితమైన గౌరవాభిమానాలున్నాయి. ఆయన్ను చూసి భయపడ్డ విద్యార్థులు కానీ, వేళాకోళం చేయాలని మనసుపడే విద్యార్థులు కానీ అరుదు. నిష్కల్మష ప్రేమను ఆయన శిష్యులకు పంచిపెట్టేవాడు. బాధ్యతగల గురువుగా విద్యా బోధన కావించేవాడు. పిల్లలకు చదువు చెప్పేటప్పుడు వారిలో ఆసక్తిని సృష్టించవలసిన బాధ్యత కేవలం గరువుదేనని గుర్తించిన అతికొద్ది మంది అధ్యాపకులలో శ్రీకాంత్ ఒకడు. ఈ లక్షణాలన్నీ కలిసి శ్రీకాంత్‌కు విద్యార్థులలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించగా బడిపంతులు అనే పేరు శ్రీకాంత్ వ్యక్తిత్వంలో కలిసిపోయింది. ఎందరో అధ్యాపకులు శ్రీకాంత్‌ని చూసి అసూయపడేవారు. ఆదర్శంగా పెట్టుకునేవారు. కానీ శ్రీకాంత్ స్థానం మాత్రం విద్యార్థుల మనసులలో చెక్కుచెదరకుండా అలాగే ఉంటూ వచ్చింది.

బడిపంతులు ఉద్యోగం శ్రీకాంత్ వ్యక్తిత్వంలో భాగమయిపోయిందనడానికి నిదర్శనంగా ఆయన పేరు శ్రీకాంత్ మేష్టారు అయిపోయింది. శ్రీకాంత్, మేష్టారు- అన్న

రెండు పదాలనూ విడదీసి ఆయన్ను పిలవాలనుకుంటే ఆయన పేరు శ్రీకాంత్ కాదు - ఉత్త మేష్టారు మాత్రమే!

శ్రీకాంత్ మేష్టారి సబ్జక్ట్సు చాలా ఉన్నా, లెక్కలు చెప్పడంలో ఆయనకు చాలా మంచి పేరుంది. ఆ కారణంగా ఆయన ఇంటికి ఎందరో విద్యార్థులు ప్రయివేటు చెప్పించుకునేందుకు వచ్చేవారు. ఉదారంగా విద్యాదానం చేయాలన్న ఆశయం ఆయనకు లేదు. ఆ కారణంగా డబ్బు తీసుకునే విద్యార్థులకు ప్రయివేటు చెప్పేవాడాయన. అంతేకాదు- డబ్బు ఇచ్చే వాళ్ళకు మాత్రమే ఆయన ప్రయివేట్లు చెబుతూండేవాడు. ఎటొచ్చీ క్లాసుల్లో కూడా ప్రయివేటంత శ్రద్ధగానూ పాఠం చెప్పడం ఆయన ప్రత్యేకత.

ఇవన్నీ శ్రీకాంత్ మేష్టారుద్యోగంలో చేరిన మొదటి అయిదు సంవత్సరాలలోని ముచ్చట్లు. అవే ముచ్చట్లు ఇప్పటికీఉన్నాయి. ఇప్పుడు మేష్టారి వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. ఆయనకు ఇద్దరబ్బాయిలూ, ముగ్గురమ్మాయిలూ. పెద్దబ్బాయి రవికి పాతికేళ్ళుండవచ్చు. అతనికి వివాహం కూడా అయింది ఇటీవలే. శ్రీకాంత్ మేష్టారు తాతయ్య కూడా అయ్యారు. రవి బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఏదో తన బ్రతుకు తను బ్రతకగలనన్న విధంగా అతని జీవితం గడచి పోతోంది.

మేష్టారి రెండో సంతానం ఆడపిల్ల. పేరు శారద. మాష్టారు సంగీతం చెప్పించకపోయినా ఆమె కొంత మందికి ఏకలవ్య శిష్యరికం చేసి కొంత విద్య సంపాదించుకుంది. మేష్టారి ఇంట్లోని రేడియో ఆమె ప్రయత్నాలకు సహకరించింది. శారద చెల్లెలు రమ. రమ తమ్ముడు రాఘవరావు. రాఘవరావు చెల్లెలు పద్మావతి.

ఆఖరి పిల్ల పద్మావతి పెద్దమనిషై ఆరు నెలలయింది. ఆమె కంటే రాఘవరావు ఒక్క సంవత్సరం మాత్రమే పెద్ద. అతనింకా హైస్కూలు చదువు ఆఖరి దశలో ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో ఇరవై ఒక్క సంవత్సరం నిండిన శారదకు పెళ్లి చేయవలసిన బాధ్యత శ్రీకాంత్ మేష్టారికి కాస్త బరువుగానే ఉంది.

ఇప్పుడిప్పుడే మేష్టారు గుర్తిస్తున్నాడు - బ్రతకలేక బడిపంతులు అన్నదాన్ని. బ్రతకడానికి మాత్రమే బడిపంతులు అని మార్చాలని - ఎందుకంటే ఇంతకాలంగా ఆయన చేస్తున్న సంపాదన కేవలం బ్రతకడానికి మాత్రమే సరిపోతూ వస్తోంది. చెప్పుకోదగ్గ నిల్వ ఏమీ ఆయనవద్ద లేదు.

శారద పెళ్ళి గురించి మేష్టారు గత అయిదారు సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అసలు శారద పెళ్ళి చేసేకనే పెద్ద కొడుకు పెళ్ళి చేయాలని ఆయన అనుకున్నాడు. కానీ కుదరలేదు. ఈ రోజుల్లో మగపిల్లాడున్న తలిదండ్రులకి వాడో ఇంటివాడయ్యేవరకూ ఆడపిల్లల తలిదండ్రులు స్థిమితం లేకుండా చేస్తారు. ఉద్యోగంలో ఉన్న రవికి పెళ్ళి స్థిరపడేవరూ మేష్టారికి స్థిమితం లేకపోయింది. ఆశయాలకు పోకుండా ఆయన కొడుక్కి కట్నం తీసుకున్నాడు. అందులో అన్ని ఖర్చులూ పోగా మిగిలిన రెండు వేల అయిదు వందలూ శారద పెళ్ళి కోసమని బ్యాంకులో వేసి ఉంచినందుకు కోడలు అత్తగారి దగ్గర ఎప్పుడైనా దెప్పుతూ ఉంటుందన్న విషయం మేష్టారికి తెలుసు.

కానీ శారద పెళ్ళి యింకా కుదరలేదు.

పెళ్ళి చేసుకున్నాక శారద సుఖపడాలన్న ఆశయంతో మేష్టారు సంబంధాలు వెతుకుతున్నాడు. అటువంటి సంబంధాలు హిరణ్యాక్షవరాల తోడులేకుండా దొరకడంలేదు.

మేష్టారి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కాలం ముందుకు పరుగెడు తూనేఉంది. కానీ అదృష్టం కలిసి రావడం లేదు. శారద వివాహం స్థిరపడ్డం లేదు.

ఈ పరిస్థితుల్లో మేష్టారింటికి ఓ అతిథి వచ్చాడు. ఒకప్పుడు అతి సామాన్యుడుగా పరిగణించబడ్డ ఆ అతిథి ఇప్పుడు చాలా గొప్పవాడు. అతిథి పేరు రామారావు. వయస్సు ఇరవై ఆరు సంవత్సరాలు.

రామారావుకు చిన్నతనంలోనే తల్లీ తండ్రీ పోగా మేనమామల ఇంట పెరిగాడు. కొన్ని కారణాలవల్ల అతను రెండు సంవత్సరాల పాటు శ్రీకాంత్ మేష్టారి ఇంట విద్యాభ్యాసం చేయడానికి ఉండవలసి వచ్చింది. స్కూలు ఫైనల్ పరీక్షలు అతడు మేష్టారి ఇంట్లో ఉన్నప్పుడే రాశాడు. స్కూలు మొత్తానికి రెండో వాడిగా పరీక్ష ప్యాసై అంతా మేష్టారి దయేనని, తనదేమీలేదని వినయంగా చెప్పుకున్నాడు రామారావు. తదుపరి భవిష్యత్తు అయోమయంగా ఉన్న సందర్భంలో అతను మేష్టారి ఇల్లు వదిలాడు. రామారావు వెళ్ళిపోవడంవల్ల కాస్త ఇంటి ఖర్చు తగ్గిందని అప్పట్లో మేష్టారి భార్య కాస్త సంబరపడింది.

ఇప్పుడు రామారావు ఏదో కంపెనీలో నెలకు వెయ్యి రూపాయలు సంపాది స్తున్నాడట.పెద్ద ఉద్యోగస్తుడని అతన్ని చూడగానే తెలుస్తుంది. చేసే ఉద్యోగాన్ని బట్టి మనిషి రూపురేఖలుంటాయని - తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుంటూ అనుకున్నాడు శ్రీకాంత్ మేష్టారు.

రామారావు ఎందుకొచ్చాడో మేష్టారికి వెంటనే అర్థం కాలేదు. అయినా అలవాటు ప్రకారం మొదట్లోనే రామారావు వివాహితుడా కాదా అన్న విషయం తేల్చుకున్నాడు. ఇంకా అతనికి వివాహం కాలేదని తెలియగానే ఆయనకు, ఆయన భార్యకూ కూడా ఆశ కలిగింది. అతని అర్థాంతరపు రాకకు, అతను బ్రహ్మచారి కావడానికి సంబంధముంటే బాగుండునని ఇద్దరూ అనుకోసాగారు. ఎందుకంటే దూరపు వరుసలో శ్రీకాంత్ మేష్టారికి రామారావు ఎప్పుడో అల్లుడై ఉన్నాడు.

రామారావు మేష్టారింటికి వస్తూనే తననూ తన పరిస్థితినీ చెప్పేసుకున్నాడు శ్రీకాంత్. మేష్టారి ఇంట్లో గడిపిన రెండుసంవత్సరాలు తన జీవితంలో మరుపురాని అనుభూతి అన్నాడు. ఎన్నోపాత విషయాలను తిరగదీశాడు. అందరితో చనువుగా మసలసాగాడు. కానీ తనెందుకు వచ్చిందీ మాత్రం చెప్పలేదు.

తను వచ్చిన నాలుగురోజులకు రామారావు మేష్టారితో అన్నాడు. "మావయ్యా, మీరు నిజంగా చాలా గొప్పవారు. మీ గొప్పతనాన్ని మాటల్లో వర్ణించడం నాబోటివాడికి సాధ్యంకాదు. మనిషికి మనిషిగా మీరిచ్చే ఆదరణ, టీచరుగా విద్యార్థుల పట్ల మీరు చూపే బాధ్యత ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా ఉండాలి."

శ్రీకాంత్ మేష్టారు కాస్త ఇబ్బందిగా ఫీలయి, " నా గొప్పతనం చూసేవాళ్ళకు

కనపడుతుందికానీ, ఇంతకీ ఏమిటి విశేషం?'' అన్నాడు. సంతోషం దాచుకున్నా ఆయన ముఖంలో దాగటం లేదు.

రామారావు మళ్ళీ అన్నాడు. 'కేవలం మీ కారణంగా వృద్ధిలోకి వచ్చిన విద్యార్థులెందరో ఉన్నారు. మీరు వాళ్ళని మరిచిపోయినా మిమ్మల్ని వాళ్ళు అనుక్షణం తలచుకుంటూనే ఉంటారు.''

ఈ ఉపోద్ఘాతం దేనికో మేష్టారికి అర్థం కాలేదు. కానీ రామారావు వివరించనూ లేదు.

ఆ తర్వాత రెండు రోజుల వరకూ రామారావు మళ్ళీ మేష్టారి గొప్పతనం గురించి మాట్లాడలేదు. ఈ రెండు రోజులూ అతను మేష్టారి ఇంటి సమస్యల గురించి - ముఖ్యంగా శారద పెళ్ళి గురించి తరచుగా మాట్లాడాడు. ఇది మేష్టారిలో కొత్త ఆశలు చిగురించడానికి దోహదం చేసింది.

రామారావు కారణంగా మేష్టారిలో కొత్త ఆలోచనలు ప్రారంభమయ్యాయి. ఆయన తన జీవితాన్ని సింహావలోకనం చేసుకోసాగాడు.

శంకర్రావుని ఒక కుర్రాడుండేవాడు. అతడి బుర్రకు లెక్కలో పట్టాన ఎక్కేవి కాదు. మిగతా అన్ని సబ్జక్టుల్లోనూ అతనికి ఫస్టు మార్కులు వస్తూండేవి. ఫోర్తు ఫారంలో అతనికి లెక్కల్లో పరీక్ష పోయింది. ప్యాసు కావడానికి 25 మార్కులు రావాలి. అన్ని సబ్జక్టులోనూ 60 దాటిన వారికి లెక్కల్లో 20 మార్కులు వచ్చినా ప్యాసు చేస్తారు కానీ శంకర్రావుకి పదిహేడు మాత్రమే వచ్చాయి. మేష్టారు ఈ విషయం దృష్టిలో పెట్టుకుని సిఫార్సు అక్కరలేకుండానే ఎలాగో 3 మార్కులు కలిపి 20 చేశాడు. శంకర్రావు పరీక్ష ప్యాసయ్యేడు. అప్పుడతనికావిషయం చెప్పి లెక్కల్లో ప్రత్యేక శ్రద్ధ వహించ వలసిందని హెచ్చరించాడు. శంకర్రావీహెచ్చరికను పాటించి మేష్టారి దగ్గరి ప్రయివేటు ప్రారంభించి మార్కులు కలపనవసరం లేకుండా పరీక్ష ప్యాసయ్యే స్థాయికి వచ్చాడు. ఇప్పుడతను ఎక్కడో డిప్యూటీ కలెక్టర్‌గా ఉంటున్నాడు.

విశ్వనాథమనే కుర్రాడొకడు చాలా ఆకతాయిగా ఉండేవాడు. అతనికి ఒకసారి లెక్కల్లో సున్నా వచ్చింది. సున్నా వచ్చినవాడతడొక్కడే కావడం వల్ల క్లాసులో అందరూ అతని మార్కులు చదివినప్పుడు గట్టిగా నవ్వేశారు. అది కక్షగా పెట్టుకుని అతను మేష్టారిని ఆ రోజు సాయంత్రం దూరాన్నించి రాయి పుచ్చుకొని కొట్టాడు. మేష్టారికి దెబ్బ కాస్త గట్టిగానే తగిలింది. ఈ దృశ్యం ఒకరిద్దరు చూసి హెడ్మాష్టరుకు కంప్లయింట్ చేశారు. ఈలోగా మేష్టారు విశ్వనాథాన్ని రహస్యంగా పిలిచి, ''నాకు నువ్వంటే భయమూ లేదు, కోపమూ లేదు. నీకు లెక్కల్లో సున్నా రావడం నా తప్పు కాదు. ఆసక్తి ఉంటే నూటికి నూరు మార్కులు వచ్చేలా చేయగలను నేను. మరెప్పుడూ ఇలా తప్పు చేయనంటే నీకు శిక్ష పడకుండా చేయగలను'' అన్నాడు. విశ్వనాథం అంగీకరించాడు. మేష్టారు హెడ్మాష్టరుకు ఎలాగో నచ్చజెప్పగలిగాడు. ఆ తర్వాత విశ్వనాథానికి లెక్కల్లో నూటికి నూరు రాకపోయినా సున్నా మాత్రం మళ్ళీ రాలేదు. ఆ విశ్వనాథం ఇప్పుడు పోలీస్ ఇన్‌స్పెక్టరయ్యాడు.

ఎందరో విద్యార్థుల మానస, విద్యా వికాసాలకు మేష్టారు తోడ్పడ్డాడు. మేష్టారి కారణంగా ఎందరో అతి సామాన్య స్థితి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకున్నారు.

అయితే ఇవన్నీ తన జీవితానికి ఏ విధంగా ఉపయోగపడ్డాయి అన్న ఆలోచన ఇప్పుడు మేష్టారి బుర్రలో తిరుగుతోంది.

తన ఆదాయం వ్యయాన్ని మించడం లేదు. తన పిల్లలకు బంగారు భవిష్యత్తు ఏర్పడడం లేదు. తన సమ్యలేవీ పరిష్కరించబడడం లేదు.

పదిమందికీ అవసరమైన వస్తు సామగ్రిని సమకూర్చే వ్యాపారి కూడా ప్రజాసేవ చేస్తున్నాడు. ఆ సేవ అతనికి లాభాలు చేకూర్చగా స్వల్ప వ్యవధిలో అతను ధనవంతుడు కాగలుగుతున్నాడు.

ప్రపంచంలో ఎక్కడెక్కడో జరిగే వార్తా విశేషాలను ప్రజల కందించిన వార్తాపత్రికల యజమానులు క్రమంగా ధనవంతులు కాగలగుతున్నారు. పదిమంది వినోదానికి పత్రికలు నడిపే సంపాదకులు ధనం విషయం ఎలా ఉన్నా, దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోగలుగు తున్నారు.

ప్రజాసేవకులమని తమను తాము పిలుచుకోనే ప్రజానాయకులు-ఇటు సంపదనూ అటు పేరు ప్రఖ్యాతులనూ కూడా తెచ్చుకుంటున్నారు.

కానీ అందరికీ విద్యను ప్రసాదించే ఉపాధ్యాయుడు మొదటి నించి చివరిదాకా ఒకే విధంగా ఉంటున్నాడు.

ధాన్యం పండించే రైతు జీవితంలో చెప్పుకోదగ్గ మార్పు ఉండడం లేదు. కానీ ధాన్యం వ్యాపారి త్వరగా గొప్పవాడు కాగలుగుతున్నాడు. సామాన్యుడిని నాయకుణ్ణి చేసే సామాన్యుల జీవితంలో మార్పుండడం లేదు. కానీ నాయకుడు మాత్రం త్వరగా గొప్పవాడు కాగలుగుతున్నాడు. మనుషులకు విద్యను ప్రసాదించి - వారు గొప్పవారు కావడానికి దోహదం చేసే ఉపాధ్యాయుడు అతి సామాన్య జీవితం గడపవలసి వస్తోంది.

ఈ లోపం ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?

తను భవంతి ఎందుకు కట్టుకోలేకపోతున్నాడు? డబ్బు ఎందుకు కూడబెట్టలేక పోతున్నాడు? కారులెందుకు కొనలేకపోతున్నాడు?

హఠాత్తుగా మేష్టారిలో కొత్త కోరికలు పురివిప్పుకోసాగాయి. తను మేడ కట్టాలి. తను కారు కొనాలి. తనూ తన పిల్లలూ ఖరీదైన బట్టలు కడుతూ, సమస్యలంటే తెలియకుండా విలాస జీవితం గడపాలి. తలుచుకుంటే తనకిది సాధ్యపడాలి. తను గొప్పవాడు, ఎందరినో గొప్ప వాళ్ళను చేస్తూ తను తనను మాత్రమెందుకు గొప్పవాడిని చేసుకోలేడు?

తన ఆలోచనల్లో ఏదో చిన్న పొరబాటున్నదని మేష్టారికి అనిపించకపోలేదు. కానీ అదేమిటో తెలియలేదు.

రామారావు వచ్చిన వారం రోజులకు అసలు విషయం తెలిసింది. పది మంది పాత విద్యార్థులు కలిసి శ్రీకాంత్ మేష్టారిని సన్మానించదల్చుకున్నారు. ఆ రోజు వరకు అసలు

విషయం చెప్పకుండా ఆయన్ను ఆశ్చర్యపరచదల్చుకున్నారు.

సన్మానం రోజు పది మందీ మేష్టారి ఇంటికి వచ్చారు. అప్పటికే వారు హైస్కూల్లో హెడ్మాష్టరుతో మాట్లాడి అన్ని ఏర్పాట్లూ చేసి వచ్చారు. ఊరంతా క్షణాల మీద సమాచారం ప్రచారం జరిగిపోయింది.

ఆ పది మందీ కూడా ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు సంఘంలో. ఆఫీసర్లు, సైంటిస్టులు, ప్రజానాయకులు వగైరాలున్నారు వారిలో.

సాయంత్రం శ్రీకాంత్ మేష్టారి జీవితంలో మరుపురాని మధుర సన్నివేశం. ఎందరో పాత విద్యార్థుల లిఖిత అభినందన పత్రాలున్నాయి. మేష్టారి మీద కవితలల్లబడ్డాయి. ఆ రోజు ఆయనకు లభించిన ప్రశంసలు అసంఖ్యాకం.

మొట్టమొదటిసారిగా మేష్టారు భార్యతో కలిసి వేదికపై కూర్చున్నారు. శిష్యులు దంపతులిద్దరకూ పట్టు బట్టలిచ్చేరు. మేష్టారికి బంగారు కలం బహుమతిగా వచ్చింది. పాఠశాలలోని ఉపాధ్యాయులతోపాటు, ఊళ్లోని కొందరు పెద్దలు కూడా శ్రీకాంత్ మేష్టారి కృషిని అభినందించారు.

సన్మానం అయిపోయింది. రామారావు తుది పలుకులు పలుకుతూ - "మండుటెండలో ప్రయాణంచేసే బాటసారి అనుకున్న విధంగా గమ్యం చేరుకునేందుకు మధ్యలో చల్లని నీడ అవసరం. అటువంటి నీడ ప్రసాదించే వృక్షమే ఉపాధ్యాయుడు. శ్రీకాంత్ మేష్టారు సామాన్య వృక్షం కాదు. మహా వటవృక్షం! ఈ మహానుభావుడి చల్లని నీడలో బుద్ధి వికాసాన్ని పొందకుండా - మీ ముందు నిలబడ్డ ఈ పాత విద్యార్థులిప్పటి స్థాయికి చేరుకుని ఉండేవారు కాదని ఘంటాపథంగా చెప్పగలను" అన్నాడు.

మర్నాడు రామారావు తిరుగు ప్రయాణమవుతూ మేష్టారికి తన పరిస్థితి చెప్పాడు. స్కూల్ ఫైనల్లో తన మార్కులు చూసి ఒక దూరపు బంధువు అతన్ని ఇంట్లో పెట్టుకుని చదివించేడట. ఆయన దయవల్లనే తను ఉన్నత విద్యాభ్యాసం కావించగలిగాడట. ఆయన కూతురిని వివాహం చేసుకోవలసిన బాధ్యత రామారావుపై ఉంది. మరో మూడు నెలల్లో కంపెనీవారు రామారావుని ట్రయినింగుకని జర్మనీ పంపించబోతున్నారు. ఈలోగా రామారావు వివాహం జరగవచ్చు.

మేష్టారికి పనికి వచ్చే ఒకటి రెండు సంబంధాలు సూచించి రామారావు వెళ్ళిపోయాడు. రామారావుని బస్సు ఎక్కించి నిరుత్సాహంగా ఇంటిదారి పట్టాడు శ్రీకాంత్ మేష్టారు. నిన్న తనను ఆకాశానికి ఎత్తేసిన రామారావు ఈ రోజు మళ్ళీ భూమి మీద దింపేసి వెళ్ళిపోయాడు. రామారావు సూచించిన రెండు సంబంధాలూ సామాన్యమైనవి. అవి తన పరిస్థితిని అతని దృష్టిలో తన స్థానాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

ఎండ కాస్త గట్టిగానే కాస్తోంది. మేష్టారికి నెత్తి మాడుతోంది. ఆయన త్వరగా నాలుగడుగులు వేసి ఒక చెట్టు నీడ చేరుకున్నాడు. అప్పటికి ఆయన ప్రాణం తెరిపినపడింది.

ఒక్క నిముషం తమాయించుకుని ఆయన చుట్టూ పరికించాడు. తనిప్పుడు ఒక పెద్ద మర్రి చెట్టు నీడలో ఉన్నాడు.

హఠాత్తుగా ఆయనకు నిన్నటి రామారావు మాటలు గుర్తు కొచ్చాయి. తననతడు మర్రి వృక్షంతో పోల్చాడు.

అప్పుడే మేష్టారి నెత్తిమీద రెండు మర్రి కాయలు రాలాయి, ఆయన ఉలిక్కిపడ్డాడు. ఆయన బుర్రలో ఏదో తళుక్కుమంది.

ఒకానొకప్పుడు బాటసారి మర్రిచెట్టు నీడలో సేదతీర్చుకుంటూ, దూరాన ఉన్న గుమ్మడి పాదుకున్న గుమ్మడి కాయలు మర్రిచెట్టుకున్న చిన్న కాయలతో పోల్చి ఇంత పెద్ద చెట్టుకు చిన్న కాయల్నీ, అంత చిన్న పాదుకు పెద్ద కాయల్నీ ఇచ్చిన సృష్టికర్త తెలివితక్కువతనాన్ని నిందించుకున్నాడు. అయితే నెత్తి మీద నాలుగు మర్రి కాయలు రాలి పడే వరకూ మర్రిచెట్టుకు గుమ్మడి కాయలుంటే వచ్చే కష్టం అర్థం కాలేదు బాటసారికి.

మర్రిచెట్టు మహావృక్షమే కావచ్చు. కానీ అది బాటసారికి చేయగల ఉపకారమల్లా చల్లని నీడను ప్రసాదించగలగడం మాత్రమే! తన ధర్మాన్నది సక్రమంగా నెరవేర్చడం కోసం దానికాయలు చిన్నవిగానే ఉన్నాయి.

కంసాలి బంగారాన్ని తయారుచేయలేడు, బంగారానికి చక్కని రూపునివ్వగలడు. దాన్ని అందంగా వివిధ రూపాలలోకి మలచగలడు. ఉపాధ్యాయుడు మనిషిని తయారుచేయలేడు. మనిషిని తీర్చిదిద్దగలడు. తనకున్న సమర్థతను బట్టి ఒక్కో వ్యక్తి ఒకో విధంగా జీవితంలో రాణించగలుగుతాడు. ఆ విధంగా ప్రతి వ్యక్తికీ ఒక్కో గమ్యం ఉంటుంది. ఆ గమ్యం చేరుకోవడం కోసం అతను చేసే ప్రయాణంలో ఉపాధ్యాయుడు బుద్ధి వికాసమనే చల్లని నీడను ప్రసాదిస్తాడు. అతనుచేయగలిగినది అంతే!

తన శిష్యులందరూ ఒకే విధంగా తయారు కాలేదు. ఒకడు కలెక్టరయ్యాడు, ఒకడు డాక్టరయ్యాడు, ఒకడు నటుడయ్యాడు, ఒకడు రచయిత అయ్యాడు, ఒకడు ప్రజానాయకుడయ్యాడు, ఒకడు శాస్త్ర పరిశోధకుడయ్యాడు- ఇలా ఎన్నోరకాలుగా తయారయ్యారు.

మనిషి దేన్నయినా ప్రయత్నించి సాధించాలి. డబ్బు సంపాదించాలన్న కోరిక అయితే తనకున్నది కానీ అందు గురించి తను ప్రత్యేకంగా ఏమీ ప్రయత్నించలేదు. అలా ప్రయత్నించేవారికి సహకరించే ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాడు.

గుమ్మడి కాయలు కాయాలంటే గుమ్మడి పాదుగా పుట్టాలి. మరి - మర్రిచెట్టుకు మాత్రం మర్రికాయలే కాస్తాయి. పెద్ద కాయలు కాసినంత మాత్రాన గుమ్మడి పాదు మహావృక్షం కాలేదు. చిన్న కాయలు కాసిన కారణంగా మర్రిచెట్టు మహావృక్షం కాకుండాపోదు.

శ్రీకాంత్ మేష్టారు చెట్టు నీడలోంచి బయటకు వచ్చి ఇంటి దారి పట్టాడు. ఎందరో విద్యార్థులకు చల్లని నీడను ప్రసాదించిన ఆయన చెట్టు నీడ నుంచి బయటపడగానే ఎండ మళ్ళీ ఆయన్ను బాధించసాగింది.

అయితే మేష్టారాబాధను గుర్తించలేదు. ఒక జీవిత సత్యాన్ని గుర్తించిన తృప్తితోఆయన నెమ్మదిగా అడుగులు వేయసాగాడు. ★

*(కలకత్తా ఆంధ్ర సంఘం సావనీర్ - 1974)*